క్లుప్తంగా

నేడు సహస్ర తులసీ దళార్చన

దాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి దేవాలయంలో ప్రతి గురువారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806091లో చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తులు వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్రనామాలు, పూర్తి చిరునామా, ఫోన్ నంబరును 8985515989 నంబరుకు వాట్సప్ చేయాలి.

కేజీహెచ్‌లో నర్సింగ్ క్లోక్‌రూమ్ ప్రారంభం



నర్సింగ్ క్లోక్ రూమ్‌ను ప్రారంభిస్తున్న డాక్టర్ అశోక్‌కుమార్

మహారాణిపేట : కేజీహెచ్‌లో నర్సుల కోసం రూ.రెండు లక్షల 50 వేల వ్యయంతో పునర్నిర్మించిన క్లోక్ రూమ్‌ను బుధవారం సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్‌కుమార్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ రాధాకృష్ణ, అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాసకుమార్, ఆర్ఎంవో డాక్టర్ వాసుదేవరావు, డాక్టర్ జగదీష్‌కుమార్, ఏఆర్ఎంవో అరుణాకుమారి, డీఈఈ మన్మథరావు, నర్సింగ్ సూపరింటెండెంట్ విజయలక్ష్మి, నర్సుల సంఘం నాయకులు పి.వరలక్ష్మి, డి.లక్ష్మి, ఎస్.ప్రశాంతి, ఉష తదితరులు పాల్గొన్నారు.

చిత్రపటం కానుక



వైవీ సుబ్బారెడ్డికి చిత్రపటం కానుకగా అందజేస్తున్న కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు

జగదాంబ: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్, టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి పుట్టిన రోజు సందర్భంగా జీవీఎంసీ 35వ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు సుబ్బారెడ్డి చిత్రపటాన్ని కానుకగా ఇచ్చారు. బుధవారం ఆయన స్వగృహంలో అందజేసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

కంటి వైద్య శిబిరానికి స్పందన



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ శశికళ

కంచరపాలెం: స్థానిక అశోక్‌నగర్‌లోని బౌద్ధాలయంలో కంచరపాలెం జోన్ నాయీ బ్రాహ్మణ సేవా సంఘం, ఓమ్ని ఆర్కే, మాక్స్‌విజన్ సూపర్ స్పెషాలిటీ ఐ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథి 55వ వార్డు కార్పొరేటర్ కె.వి.ఎస్.శశికళ శిబిరాన్ని ప్రారంభించి పరిశీలించారు. పలువురి స్థానికులకు వైద్య సిబ్బంది నేత్ర వైద్య పరీక్షలు చేసి సూచనలిచ్చారు. కార్యక్రమంలో బౌద్ధాలయ ప్రధాన కార్యదర్శి కె.రాజుగణేష్, సంఘ అధ్యక్షుడు మల్లువలస రాధాకృష్ణ, ప్రధాన కార్యదర్శి కె.సత్యనారాయణ, సీనియర్ సభ్యులు తీడ సన్యాసిరావు, కె.ధనంజయరావు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'ఉక్కు' పరిరక్షణ ప్రతి కార్మికుడి బాధ్యత

కూర్మన్నపాలెం: నిర్బంధాలు, అణచివేతలతో ఉక్కు ఉద్యమాన్ని ఎవరూ ఆపలేరని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు పేర్కొన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్ ప్లాంట్ ఆర్చి వద్ద ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకుల ఆధ్వర్యంలో జరుగుతున్న దీక్షలు 811వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో పలు కార్మిక సంఘాల నేతలు పాల్గొన్నారు.

ఆకతాయిలు.. ఆగడాలు

- కెప్టెన్ రామారావు జంక్షన్‌లో రెచ్చిపోతున్న రౌడీమూకలు
- మహిళల పట్ల అసభ్య ప్రవర్తన
- టూరిస్టులపై దౌర్జన్యాలు
- పోలీస్ నిఘా ఏర్పాటు చేయాలని స్థానికుల డిమాండ్

నగరంలోని అల్లిపురం రద్దీగా ఉండే ప్రాంతం. అనేక వ్యాణిజ్య సముదాయాలు, చిల్లర దుకాణాలతో ఈ ప్రాంతం ఎప్పుడూ కోలాహలంగా ఉంటుంది. ఇక్కడికి కాస్త దూరంలోనే కెప్టెన్ రామారావు జంక్షన్ ఉంటుంది. ఇది కూడా బిజీగా ఉండే ప్రాంతమే. అయినా ఏదో నగర శివార్లలో జరుగుతున్నట్లు మహిళలు, ఇక్కడికి దగ్గరలో బస చేయడానికి హోటళ్లు, లాడ్జిలకు వచ్చే టూరిస్టులపై దౌర్జన్యాలకు తెగబడుతున్నారు రౌడీమూకలు. ఇదేమని ప్రశ్నించిన వారిపై దాడులు చేస్తున్నారు. వీరి ఆగడాలు స్థానికులను కూడా ఇబ్బందుల పాలు చేస్తున్నాయి. ఇక్కడ పోలీస్ నిఘా ఏర్పాటు చేస్తేనే ఈ సమస్యకు పరిష్కారం దొరుకుతుందని అంతా చెబుతున్నారు.

అల్లిపురం: కెప్టెన్ రామారావు జంక్షన్‌లో ఆకతాయిల ఆగడాలు మితిమీరిపోతున్నాయి. మత్తు పదార్థాలు సేవించిన యువకులు ఎక్కువగా ఈ రోడ్‌లో తిరుగుతూ మహిళలు, టూరిస్టుల పట్ల అసభ్యంగా ప్రవర్తించడమే కాకుండా వారిని బెదిరిస్తున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో పోలీసులు తీసుకున్న చర్యల వల్ల కాస్త తగ్గినా మళ్లీ రెచ్చిపోతున్నారని చెబుతున్నారు. ఇటీవల ఈ వ్యవహారం ఇక్కడ కొంత తగ్గినా.. మళ్లీ వారం రోజులుగా ఎక్కువైపోయిందని.. ఆకతాయిలు గుంపులు గుంపులుగా ఏర్పడి వచ్చే పోయేవారిని వేధిస్తున్నారని స్థానికులంటున్నారు. ఎవరైనా అడ్డుకున్నా వారిపై దాడులు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



చెట్టు కొమ్మల్లో ఉన్న సీసీ కెమెరాలు



ఆకతాయిల అడ్డాగా మారిన కెప్టెన్ రామారావు జంక్షన్ నుంచి గీత్ సంగీత్‌కు వెళ్లే రహదారి

టూరిస్టుల పట్ల అమానుషంగా..

ఈ ప్రాంతంలో అనేక చిన్న చిన్న హోటళ్లు, లాడ్జిలు ఉన్నాయి. వాటిలో కోల్‌కతా, ఒడిశా వంటి ప్రాంతాల నుంచి టూరిస్టులు వస్తుంటారు. వారు ఇక్కడి నుంచి అరకు, కైలాసగిరి, భీమిలికి బస్సుల్లో వెళ్తుంటారు. ఆ సమయంలో ఆకతాయిలు వారి వెంటపడి వారి పర్సులు, హ్యాండ్ బ్యాగులు కొట్టివేయటమే కాకుండా ప్రశ్నించిన వారిపై దాడులకు పాల్పడుతున్నారని స్థానికులు చెబుతున్నారు.

పోలీస్ నిఘా ఏర్పాటు చేయాలి..

ఈ ప్రాంతంలో సీసీ కెమెరాలున్నా వాటికి చెట్ల కొమ్మలు అడ్డుపడుతున్నాయి. దీనిని ఆసరాగా తీసుకుని ఆకతాయిలు రెచ్చిపోతున్నారు. పోలీసులు ఈ ప్రాంతంలో ప్రత్యేకంగా నిఘా ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఆకతాయిల ఆగడాలు అరికట్టండి



కెప్టెన్ రామారావు జంక్షన్‌లో ఆకతాయిల ఆగడాలను అరికట్టాలి. ఈ ప్రాంతంలో వారి దౌర్జన్యాలు ఎక్కువయ్యాయి. గతంలో పోలీసులు గట్టి నిఘా ఏర్పాటు చేయడంతో చాలా వరకు రౌడీమూకల సంచారం తగ్గింది. అయితే ఇటీవల మళ్లీ రౌడీల బాధ పెరిగిపోయింది. దాడులకు పాల్పడే సమయంలో అడ్డుకున్న వారిపై దాడులకు తెగబడుతున్నారు. పోలీసులు నిఘా పెంచాలి. **బొడ్డు పోలారావు, స్థానికుడు**

చర్యలు చేపడతాం..

సమస్య మా దృష్టికి వచ్చింది. దీనిపై చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే నిఘా పెంచాం. నిరంతరం పోలీస్ బీట్ ఏర్పాటు చేశాం. మరింతగా చర్యలు తీసుకుని వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తాం. టూరిస్టులకు ఎటువంటి విఘాతం కలగకుండా చర్యలు తసుకుంటాం

-బి.తిరుమలరావు, సీఐ, టూటౌన్

ఘనంగా ఐఎన్‌టీయూసీ ఆవిర్భావ దినోత్సవం

అల్లిపురం: ఐఎన్‌టీయూసీ 77వ ఆవిర్భావ దినోత్సవం బుధవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు కార్మిక నాయకులు గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ఈ సందర్భంగా ఐఎన్‌టీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈశ్వరరావు మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా కార్మిక శ్రేయస్సు కోరి 77 సంవత్సరాలుగా సేవలందిస్తున్న యూనియన్‌గా గుర్తింపు పొందిందన్నారు. జాతీయ అధ్యక్షుడు సంజీవ రెడ్డి ఆధ్వర్యంలో దేశంలో గల అన్ని కర్మాగారాల్లో కార్మికులకు సేవలందిస్తుందన్నారు. ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలు తిప్పికొడుతూ సంఘటిత, అసంఘటిత కార్మికులకు చేదోడు, వాదోడుగా నిలుస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో పోర్టు యూనియన్ అధ్యక్షుడు గొర్లె చందు, డాక్‌యార్డు యూనియన్ నాయకులు రవి, రమణ, వెంకటరావు, సత్యనారాయణ, తాతబాబు, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.



గాంధీ మహాత్ముని విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న ఐఎన్‌టీయూసీ నాయకులు, కార్మికులు

ఘనంగా వైదిక సదస్యం



విశేష అలంకరణలో బల్లిగిరి ప్రసన్న వేంకటేశ్వరస్వామి



వైదిక సదస్యంలో పాల్గొన్న వేదపండితులు

- వెంకన్న సన్నిధిలో పండితుల వేద పఠనం

అల్లిపురం: బల్లిగిరి ప్రసన్న వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. దీంట్లో భాగంగా శ్రీనివాస కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. బుధవారం ఆలయ కల్యాణమండపంలో వైదిక సదస్యం నిర్వహించారు. వేద పండితులు గురునాథ్ శర్మ, శ్రీనివాసశర్మ, ఘనాపాఠీలు పాల్గొని నాలుగువేదాలు వల్లె వేశారు. వేద పఠనంతో బల్లిగిరి మార్మోగింది. వేంకటేశ్వరుని వైభవాన్ని పండిత శ్రేష్ఠులు వివరించారు. అనంతరం ఆలయ ఈవో జీవీ రమాబాయ్ పండితులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా స్వామివారికి బాలభోగం, హోమాలు, అర్చన, నివేదన, మంగళాశాసనములు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకుడు గొడవర్తి రాఘవాచార్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రైల్వే గ్రౌండ్స్‌లో డీఆర్ఎం ఆకస్మిక తనిఖీలు

తాటిచెట్లపాలెం: రైల్వే గ్రౌండ్స్‌లోని వాకర్స్ పార్క్‌ను బుధవారం డీఆర్ఎం అనూప్‌కుమార్ సత్పతి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పార్క్‌ను మరింత సుందరంగా తయారుచేసి నగరంలోనే ఒక మోడల్ పార్క్‌గా తీర్చిదిద్దాలని సూచించారు. ఈ పార్క్‌ను ప్రధానంగా నగర పౌరులు, రిటైర్డ్ రైల్వే ఉద్యోగులు వాకింగ్ కోసం వినియోగిస్తున్నారు. పూర్తిగా పచ్చదనంతో, కూర్చునేందుకు అనువైన సదుపాయాలతో ఈ పార్క్‌ను తయారుచేశారు. పర్యటనలో ఈస్ట్ కోస్ట్ రైల్వే ఉమెన్స్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్(ఈకార్వో) ప్రెసిడెంట్ పారిజాత సత్పతి, సీనియర్ డివిజనల్ ఇంజినీర్(హెడ్ క్వార్టర్స్) ఎస్.కె.సారంగి, సీనియర్ అధికారులు, ఎలక్ట్రికల్, సివిల్ ఇంజినీరింగ్, స్పోర్ట్స్ విభాగాల అధికారులు పాల్గొన్నారు.



వాకర్స్ పార్క్‌లో పర్యటిస్తున్న డీఆర్ఎం అనూప్‌కుమార్ సత్పతి, రైల్వే అధికారులు

ఆలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన

సింహాచలం: అప్పన్నపాలెంలో భూలోకమాంబ ఆలయ పునర్నిర్మాణానికి పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ బుధవారం ఉదయం శంకుస్థాపన చేశారు. అప్పన్నపాలెం వాసుల ఆరాధ్యదైవంగా పూజలందుకుంటున్న భూలోకమాంబ ఆలయం దశాబ్దాల కిందట నిర్మించారు. కాగా వేపగుంట నుంచి గోశాల వరకు బీఆర్‌టీఎస్ రోడ్డు విస్తరణ కారణంగా అమ్మవారి ఆలయం ప్రస్తుతం ఉన్న రోడ్డు కంటే దిగువన ఉండడంతో భక్తులు ఆలయానికి వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నారు. దీంతో గ్రామ పెద్దలు ప్రస్తుతం ఉన్న ఆలయాన్ని తొలగించి పునర్నిర్మించాలని చేపట్టేందుకు నిర్ణయం తీసుకున్నారు. ఈమేరకు నిర్మాణ పనులకు బుధవారం ఎమ్మెల్యే శాస్త్రోక్తంగా కొబ్బరికాయకొట్టి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో నగర డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, వైఎస్సార్‌సీపీ నాయకులు పీతల అప్పలరాజు, పీతల విష్ణుమూర్తి, అప్పన్నపాలెం గ్రామస్తులు నోళ్ల దేముడు, పల్లా వెంకటరావు, జగదీష్, పైడిరాజు, అడవివరం కోఆపరేటివ్ సొసైటీ డైరెక్టర్ నాగరాజు, గ్రామస్తులు పాల్గొన్నారు.



ఆలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

విద్యార్థులకు మోడల్ పాలిసెట్

మురళీనగర్: కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో నిర్వహిస్తున్న పాలిసెట్ ఉచిత శిక్షణ తరగతుల్లో భాగంగా బుధవారం నమూనా పాలిసెట్ పరీక్ష నిర్వహించారు. 120 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వీరికి ఇప్పటికే ఉచిత మెటీరియల్ అందించారు. ఈ నెల 6 వరకు కోచింగ్ కొనసాగిస్తారు. ఈ నెల 10న పాలిసెట్ రాయాల్సి ఉంటుంది. ప్రిన్సిపాల్ కె.డి.వి.నరసింహారావు పర్యవేక్షించారు.

8 నుంచి వేసవి విజ్ఞాన శిబిరాలు

దాబాగార్డెన్స్: ఆంధ్రప్రదేశ్ పౌర గ్రంథాలయ శాఖ ఆధీనంలో గల అన్ని గ్రంథాలయాల్లో ఈ నెల 8 నుంచి వేసవి విజ్ఞాన శిబిరాలు నిర్వహించనున్నారు. కథలు.. కథనాలు.. సృజనాత్మక కళలతో వేసవి విజ్ఞాన శిబిరాలు జరగనున్నాయి. దీనిలో భాగంగా నగరంలోని 36వ వార్డు రంగిరీజువీధిలో గల బాలల శాఖ గ్రంథాలయంలో ఈ నెల 8 నుంచి జూన్ 11 వరకు వేసవి విజ్ఞాన శిబిరాలు నిర్వహించనున్నారు. సమ్మర్ క్యాంపులో పుస్తక పఠనం, పుస్తక సమీక్షలు, పెద్దల నుంచి విన్న అముద్రిత కథలు చెప్పడం, పేపర్ ఆర్ట్, థియేటర్ ఆర్ట్స్ వంటి సృజనాత్మక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ప్రతి రోజూ ఉదయం 8 నుంచి 12 గంటల వరకు ఈ కార్యక్రమాలు ఉంటాయి. గ్రంథాలయ పరిసరాల్లో గల విద్యార్థులు ఈ వేసవి శిబిరాన్ని వినియోగించుకోవాలని బాలల శాఖ గ్రంథాలయ అధికారి టి. పోలితల్లి కోరారు.

మహిళా వాకర్స్ క్లబ్ వితరణ



నిత్యావసర సరకులు అందిస్తున్న మహిళా వాకర్స్ ప్రతినిధులు

మురళీనగర్: మహిళా వాకర్స్ క్లబ్ 17వ వార్షికోత్సవంలో భాగంగా బుధవారం సేవా కార్యక్రమం నిర్వహించారు. ద్వారకానగర్ ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోని బెగ్గర్స్ షెల్టర్‌లో ఉంటున్న నిరాశ్రయులకు, రైల్వే స్టేషన్ రోడ్‌లో ఫుట్‌పాత్ యాచకులకు నిత్యావసర సరకులు అసోసియేషన్ ఫర్ అర్బన్ అండ్ ట్రైబల్ డవలప్‌మెంట్(ఏయూటీడీ) ద్వారా అందజేశారు. 50 కేజీల బియ్యం, పప్పులు, పంచదార, గోధుమ పిండితోపాటు వీరు సేకరించిన పాత దుస్తులు, దుప్పట్లు, నైటీలు, చీరలు, చొక్కాలు, ప్యాంట్లను సంస్థ ప్రతినిధులు వాసు, జ్యోతిలకు అందజేశారు. కార్యక్రమంలో మహిళా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు ఎం.శేషామణి, కార్యదర్శి ఎస్.పుష్పలత, కోశాధికారి లక్ష్మి, పూర్వ అధ్యక్షులు కె.మాధవి, డి.శిరీష, ఉపాధ్యక్షులు సీహెచ్ వరలక్ష్మి, లీలానాయుడు, బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లు సుభాషిణి, పద్మజ పాల్గొన్నారు.

కవులకు పరిశీలన అవసరం



సత్కారం పొందిన వారితో సాహితివేత్తలు

సీతంపేట: కవిత్వం రాసే నవకవులంతా ప్రముఖ కవులు, రచయితల రచనలు చదవడం, పరిశీలించడం అలవాటు చేసుకోవాలని సహృదయ సాహితి సంస్థ అధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ సూచించారు. సహృదయ సాహితి ఆధ్వర్యంలో బుధవారం ప్రిజం కళాశాలలో నిర్వహించిన కవి సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. నవకవుల మార్గదర్శి శ్రీశ్రీ అని, కవి మనిషి రుణం తీర్చుకునేందుకు సమాజ చైతన్యం కోసం పద్యాలు అల్లుతాడని, ప్రజల గొంతు వినిపిస్తాడని, చైతన్యమే నినాదమై నవీన యుగాన్ని ఆవిష్కరిస్తాడని తెలిపారు. రచయిత కె.జి.వేణు మాట్లాడుతూ ఇటీవల దివంగతుడైన చిత్రకారుడు బాలి గొప్పతనాన్ని, కళా విశిష్టతను వివరించి నివాళులర్పించారు. ఇటీవల కళాసేవలో నంది పురస్కారం అందుకున్న జి.కె.సుబ్రహ్మణ్యం, హైదరాబాద్‌లో జరిగిన జాతీయ సాహిత్య సంబరాల్లో సత్కారం పొందిన రామతాతలను ఈ సందర్భంగా సత్కరించారు. కార్యక్రమంలో సాహితీవేత్తలు చిన సూర్యనారాయణ, కవిత గమనం గమ్యం, రామతాత కవిత ధరాఘాతం, బి.రాధారాణి కబీర్ దాసు దోహాలు, కె.వి.ఎస్.మూర్తి కవిత భయం, కొత్తూరి రమణ ఊరగాయోపాఖ్యానం కవితలు చదివి వినిపించారు.

ఆత్మీయ కలయిక







సీఎం జగన్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మెల్యే వాసుపల్లి, కొండా రాజీవ్‌గాంధీ, సీతంరాజు సుధాకర్

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి విశాఖపట్నం, విజయనగరం పర్యటనలో భాగంగా బుధవారం ఉదయం ప్రత్యేక విమానంలో విశాఖ విమానాశ్రయానికి విచ్చేసిన సందర్భాన్ని పురస్కరించుకుని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కొండా రాజీవ్‌గాంధీ, పార్టీ నాయకులు సీతంరాజు సుధాకర్ ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు.

ఇసుకకొండకు ఆధ్యాత్మిక శోభ

- 5న సత్యదేవుని ఆలయంలో బుద్ధ పూర్ణిమ



రమా సహిత సత్యనారాయణ స్వామి

దాబాగార్డెన్స్: ఇసుకకొండ (బాబాజీకొండ)పై వెలసిన శ్రీరమా సహిత సత్యనారాయణస్వామి ఆలయంలో ఈ నెల 5న బుద్ధ పూర్ణిమను పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ ఆ రోజు వేకువ జాము నుంచి ప్రత్యేక పూజలు, సామూహిక, విశేష వ్రతాలు జరపనున్నారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి రానున్న దృష్ట్యా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్టు ఆలయ ఈవో బుద్ధ మహాలక్ష్మి నగేష్ తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్త్ ఏర్పాటు చేశామని, క్యూలైన్లలో తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేసినట్టు చెప్పారు.

దేవాలయ చరిత్ర..

ఈ దేవాలయం సుమారు 200 సంవత్సరాల కిందట సీతారామ్ బాబాజీ అనే సాధువు (సిద్ధ పురుషుడు) నిర్మించినట్టు పూర్వీకులు చెబుతారు. మహారాష్ట్ర నుంచి పాలరాతి విగ్రహాలు తీసుకొచ్చి ప్రతిష్ఠ చేసి ఆలయాన్ని నిర్మించారు. అప్పటి నుంచి దేవాలయం నానాటికీ అభివృద్ధి చెందుతూ నిత్య దీప, ధూప, నైవేద్యాలతో విలసిల్లుతోంది. 1986లో అప్పటి దేవదాయ, ధర్మదాయ శాఖ కమిషనర్ దేవాలయాన్ని దర్శించుకుని కనకమహాలక్ష్మి దేవాలయానికి దత్తత ఇచ్చి అభివృద్ధి చేస్తే దేవాలయం విశిష్టత మరింత పెరుగుందని భావించారు. అమ్మవారి దేవాలయానికి దత్తత చేసి, ఆ నిధుల నుంచి సుమారు రూ.40 లక్షలతో అభివృద్ధి చేశారు. రాజ గోపురం, అనివెట్టి మండపం, విమాన గోపురం, వివిధ కార్యక్రమాలు చేపట్టారు. ఆగమ పండితుల సలహా మేరకు దక్షిణాది ఆచారం ప్రకారం కృష్ణశిల విగ్రహాలు (నల్లరాతి) కూడా ప్రతిష్ఠించారు.

స్వామి వ్రతం..

ప్రతిరోజూ ఉదయం 8 గంటలకు, పౌర్ణమిరోజు ఉదయం 5 నుంచి 11 గంటల వరకు నిరంతరాయంగా స్వామి సామూహిక వ్రతాలు నిర్వహిస్తున్నారు. పూజా రుసుం రూ.300 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి.

ధ్వజస్తంభ పూజ, విశేష దర్శనం..

ధ్వజస్తంభ పూజ, విశేష దర్శనం చేయించుకోదలిచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. పౌర్ణమి రోజున ప్రత్యేకంగా ధ్వజస్తంభ ప్రదక్షిణ ఉంటుంది.

ఆలయం తెరచు వేళలు..

ఉదయం 5 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, తిరిగి సాయంత్రం 4 నుంచి 8 గంటల వరకు, పౌర్ణమి రోజు ఉదయం 3 నుంచి రాత్రి 10 గంటల వరకు నిరంతరాయంగా ఆలయం తెరిచే ఉంటుంది. మహానివేదన ఉదయం 11.40 నుంచి 12 గంటల వరకు.

వెంకటేశ్వరమెట్ట దేవస్థానం భూములు పరిరక్షించండి

అల్లిపురం: బల్లిగిరి శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానానికి చెందిన భూములు పరిరక్షించాలని కోరుతూ బీజేపీ ధార్మిక సెల్ ప్రతినిధులు బుధవారం దేవదాయ శాఖ సహాయ కమిషనర్ శిరీషకు, ఆలయ ఈవో జీవీ రమాబాయ్‌కి వినతిపత్రాలు అందజేశారు. ప్రత్యామ్నాయ స్థలం చూపించకుండా ఆయా భూములను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించడాన్ని భారతీయ జనతా పార్టీ ధార్మిక సెల్ వ్యతిరేకిస్తుందన్నారు. అలమేలు మంగమ్మ దేవాలయం నుంచి సింహాలదేవిడి వరకు గల భవన నిర్మాణం పూర్తిగా తొలగించాలని వారు డిమాండ్ చేశారు. దేవస్థానంలో అక్రమాలకు పాల్పడుతున్న ఉద్యోగులను తొలగించాలని వారు కోరారు. సహాయ కమిషనర్‌ను కలసిన వారిలో బీజేపీ రాష్ట్రకార్యవర్గ సభ్యులు ఎస్.విజయానందరెడ్డి, రాష్ట్ర ధార్మిక సెల్ కో కన్వీనర్ కె.విజయ శంకర్ ఫణీంద్ర, దక్షిణ నియోజకవర్గ సమన్వయకర్త కొప్పల రామ్‌కుమార్, చీదరాల దుర్గాప్రసాద్, మంత్రి శాలివాహన్, స్వామి తదితరులు ఉన్నారు.



దేవదాయ శాఖ సహాయ కమిషనర్ శిరీషకు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు, ధార్మిక సెల్ ప్రతినిధులు

వార్డు కార్యాలయం సిద్ధం

జగదాంబ: ఎట్టకేలకు జీవీఎంసీ 35వ వార్డు కార్యాలయం సిద్ధమయింది. గతంలో పూర్ణామార్కెట్‌లోనే ఈ కార్యాలయం ఉండేది. అయితే వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్‌తో పాటు మేస్త్రీలు మాత్రమే ఉండడంతో ఇబ్బంది లేకుండా సరిపోయేది. అయితే గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ వచ్చిన తర్వాత పాత కార్యాలయం కనీసం కూర్చోవడానికి కూడా వీల్లేకుండా ఉండడంతో కార్పొరేటర్ అభ్యర్థన మేరకు జీవీఎంసీ అధికారులు జనతా బజార్ వద్ద వార్డు కార్యాలయం ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. వెంటనే నిధులు మంజూరు చేసి మరమ్మతులు చేయించి ప్రారంభోత్సవానికి సిద్ధం చేశారు. దీంతో వార్డులో ఇన్‌స్పెక్టర్‌తో పాటు శానిటరీ సెక్రటరీలు, మేస్త్రీలు ఇబ్బందులు లేకుండా విధులు నిర్వహించే అవకాశం ఏర్పడింది.



75 ఫీట్‌రోడ్డు జనతాబజార్ వద్ద సిద్ధమైన వార్డు కార్యాలయం